చేతిపంపునకు మరమ్మతు



సాక్షి ఎఫెక్ట్..

అశ్వాపురం: మండలపరిధిలోని మామిళ్లవాయి గ్రామంలో శనివారం పనిచేయని చేతిపంపునకు మరమ్మతులు చేపట్టారు. శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'పని చేయని చేతిపంపులు'అనే కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్, ఎంపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ప్రతాప్‌రానా ఆధ్వర్యంలో గ్రామంలో పనిచేయని చేతి పంపునకు మరమ్మతులు చేపట్టారు. ఇంకో చేతి పంపునకు రెండు రోజుల్లో మరమ్మతులు చేపిస్తామన్నారు. గ్రామస్తులకు మిషన్ భగీరథ స్వచ్ఛమైన నీరు తాగాలని అవగాహన కల్పించి, ట్యాంకర్‌తో నీరు సరఫరా చేస్తున్నామని తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి ప్రతాప్‌రానా తెలిపారు.

క్లుప్తంగా

విద్యార్థినికి సన్మానం

అశ్వాపురం: ఇంటర్మీడియట్ ఎంఈసీలో 985 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించిన మండల పరిధిలోని జగ్గారం గ్రామానికి చెందిన బొల్లు యశస్వినిని శనివారం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లో తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోండి

గుండాల: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హరిక్రిష్ణ శనివారం తెలిపారు. 2024–26 విద్యా సంవత్సరానికి గానూ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో భర్తీకి గురుకుల కళాశాల కిన్నెరసానిలో 25న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు పదో తరగతి ఒరిజనల్ సర్టిఫికెట్స్ టీసీ, ఎస్ఎస్‌సీ మెమో, స్టడీ అండ్ కండక్ట్, కుల, ఆదాయ సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు జీరాక్స్, పాస్‌ఫొటోలతో కౌన్సెలింగ్ కేంద్రాలలో హాజరుకావాలని సూచించారు. గ్రామీణ ప్రాంత వాసుల రూ.1లక్షా50 వేలు, పట్టణ వాసులకు రూ. 2లక్షలు ఆదాయం కలిగిన వారు అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆదివాసీలను ఇబ్బందులకు గురిచేయొద్దు

దుమ్ముగూడెం : మండలంలోని పలు బ్యాంకుల అధికారులు ఆదివాసీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని ఏవీఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సొందె మల్లూరు విమర్శించారు. శనివారం లక్ష్మీనగరం గ్రామంలో జరిగిన సమావేశంలో మండలంలోని ఓ బ్యాంకు అధికారులు ఆదివాసీ మహిళను నగదు ఇచ్చే దగ్గర ఇబ్బంది పెట్టారని సంఘం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏజెన్సీ ప్రాంతంలో బ్యాంకు మేనేజర్లు, బ్యాంక్ సిబ్బంది ఆదివాసీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తక్షణమే ఐటీడీఏ పీఓ, కలెక్టర్ దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రేస్ ఆదినారాయణమూర్తి, కొరస రామచంద్రయ్య, ఉబ్బ వెంకటేష్, తాటి రాంబాబు, శ్యామల, తురస కృష్ణబాబు, సవలం అరుణ, గోవిందరాజు, నరేష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న గెలుపునకు కృషి చేయాలి

భద్రాచలంటౌన్: ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపునకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఒక జాబ్ నోటిఫికేషన్ కానీ, ఉద్యోగ పోటీ పరీక్షలను గాని సక్రమంగా నిర్వహించలేకపోయిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అనుచిత వైఖరిపై అనునిత్యం ప్రభుత్వాన్ని ఎండగడుతూ అలుపెరగని పోరాటం తెలిపారు. విద్యావంతులు తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

బూర్గంపాడు: తీన్మార్ మల్లన్నను భారీ మెజారిటీతో గెలిపించాలని యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు భజన సతీష్ కోరారు. ఈ మేరకు బూర్గంపాడులో పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లన్నను చట్టసభలకు పంపించి పట్టభద్రులు తమ సమస్యల పరిష్కార మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తోగునీరే అండ..



తోగు వద్ద నీళ్లు తోడుతున్న ఆదివాసీ మహిళలు

ఏళ్లుగా జలప్రదాయినిలా నిలుస్తున్న తోగు

- దాహార్తి తీర్చుకుంటున్న వెంకటచెరువు గ్రామవాసులు
- అంతటా నీటి ఎద్దడి ఎదురైనా ఇక్కడ ఆగని ప్రవాహం
- గ్రామంలో నీరు ఉన్నా తోగును వదలని ఆదివాసీలు

సండే స్పెషల్

చర్ల రూరల్: ఏళ్లుగా ఆ గ్రామ ప్రజలు ఆవాసాలకు రెండు కిలోమీటర్ల దూరంలో అడవిలో ఉన్న తోగు నీళ్లనే తాగుతున్నారు. తరతరాలుగా ఈ తోగు నీటినే వినియోగిస్తున్నారు. ఎండాకాలంలో అన్నిచోట్ల బావులు, బోర్లు ఎండిపోయినా ఈ తోగు మాత్రం నిత్య జలప్రధాయినిగా నీరు అందిస్తోంది. నీటిధార ఎక్కడ నుంచి వస్తుందో తెలియకున్నా గ్రామస్తులకు నీటి లోటు తీరుస్తుండడంతో ఎండాకాలమే కాదు వర్షాకాలం, శీతాకాలంలోనూ ఈ తోగు నీటినే వినియోగిస్తున్నారు చర్ల మండం వెంకటచెరువు గ్రామస్తులు.

అమృతధార...

చర్ల మండలంలోని వెంకటచెరువు గ్రామానికి సమారు రెండు కి.మీ. దూరాన అడవిలో ఉన్న తోగు నీరే ఏళ్లుగా ఆ గ్రామంలోని ఆదివాసీలకు తాగునీటిగా ఉపయోగపడుతోంది. గ్రామ ప్రజల దాహార్తిని తీరుస్తోంది. గ్రామంలోని ప్రజలు అన్ని కాలాల్లోనూ తోగు నీటినే తాగుతున్నారు. తరతరాలుగా ఈ నీటినే తాగుతుండగా, ఏనాడు ఎండిపోకపోగా.. ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకపోవడంతో వారికి జలప్రదాయినిగా నిలుస్తోంది. అడవితల్లిలో ఒదిగిన చెట్ల వేళ్లను తాకుతూ ప్రకృతి ప్రసాదించిన అమృతధారగా ఈ నీరు వస్తోంది. తొలినాళ్లలో ఊటగా వచ్చే నీటికి చుట్టూ చెట్ల మొద్దులను అడ్డుగా పెట్టుకుని మంచినీళ్లుగా వాడుకునే వారట. ఆతర్వాత వర్షాలకు మొద్దులు కొట్టుకుపోవడంతో ప్రస్తుతం సిమెంటు వరల ద్వారా ఊట బావిలా మార్చుకున్నారు. దీంతో ఇప్పుడు వర్షాకాలంలో సైతం ఇక్కడి తోగు నీటిని తెచ్చుకునేందుకు వీలవుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామానికి తాగునీటి సౌకర్యం ఉన్నప్పటికీ తరతరాలుగా వస్తున్న ఆనవాయితీగా వదిలిపెట్టకుండా దూరమైనా సరే వెళ్లి గ్రామ ప్రజలు తోగు నీటిని తెచ్చుకుని తాగేందుకు ఇష్టపడుతుండడం విశేషం.



తాగునీరు తెచ్చుకుంటున్న మహిళలు

ఎలాంటి సమస్యలు లేవు...



ఏళ్ల తోగు నీటిని తాగుతున్నా మాకు ఎటువంటి అనారోగ్య సమస్యలు రాలేదు. ప్రతీరోజు ఇక్కడి నుండే మంచినీళ్లు పట్టుకుని వెళ్తాం. ఎన్నో వన మూలికలను తాకుతూ వచ్చే ఈ తోగు మా గ్రామానికి దగ్గరగా ఉండడం మా అదృష్టం.

– సోడి గీత

తరతరాలుగా ఈ నీరే..



ముప్పై ఏళ్లకు పైగా మేం ఇక్కడి తోగు నీళ్లనే తాగుతున్నాం. గ్రామంలో నీటి సౌకర్యం ఉన్నప్పటికీ నిత్యం తాగేందుకు ప్రకృతి ప్రసాదించిన తోగు నీరు తెచ్చుకోకుండా ఉండలేము. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తోగు నీళ్లనే ఇష్టంగా తాగుతాం.

– కారం సునీత

శుభ్రంగా ఉంచుకుంటాం



మా గ్రామానికి నిత్యం మంచినీళ్లను ప్రసాదిస్తున్న తోగు, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకుంటున్నాం. మా గ్రామ ప్రజలకే ఈ నీరు ప్రత్యేకం. అంతేకాక పక్షులు, పశువులకు సైతం తోగు నీరు ఏళ్ల తరబడి దాహార్తిని తీరుస్తోంది.

– బాడిశ శాంతి

ఇంజనీర్ మృతిపై విచారణ చేపట్టాలి



ఏరియా జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సీఎంఓఏఐ అధికారులు

మణుగూరు టౌన్: సింగరేణి ఎస్టీపీపీ ఇంజనీర్ కిరీటీ మృతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్(సీఎంఓఏఐ) ఆధ్వర్యంలో శనివారం ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌కు అధికారుల సంతకాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులుడు లక్ష్మీపతిగౌడ్ మాట్లాడుతూ.. బొగ్గు లక్ష్యాన్ని సాధించడంలో ఉద్యోగులకు ఎంతో అధికారులు భరోసా ఇచ్చానా క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయన్నారు. విజిలెన్స్ అధికారుల వేధింపులతో పాటు పని ఒత్తిడే ప్రధాన కారణమని సూసైడ్ నోట్‌లో వివరించిన కిరీటీ మృతే దీనికి ఉదాహరణ అన్నారు. అహర్నిశలు శ్రమిస్తున్న అధికారుల పరిస్థితులు అర్థం చేసుకోకుండా కొంతమంది అనాలోచితంగా వ్యవహరించడం వల్ల అధికారుల మనోధైర్యం దెబ్బతిని దీని ప్రభావం ఉత్పత్తి ఉత్పాదకతలపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్యాంసుందర్, నర్సిరెడ్డి, శ్రీనివాసచారి, వీరభద్రయ్య, దండమూడి రాంబాబు, రమణారెడ్డి, మదార్‌సాహెబ్, కోడికృష్ణమూర్తి, నాగేశ్వరరావు, వెంకట్రావు, రాజేశ్వరరావు, కల్యాణ్‌రామ్, అన్ని గనుల, డిపార్ట్‌మెంట్లకు చెందిన అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పూజారి సత్యనారాయణను గెలిపిద్దాం..

భద్రాచలంఅర్బన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జాతీయ మానవ హక్కుల కమిటీ సభ్యులు బలపరిచిన స్వతంత్ర అభ్యర్థి పూజారి సత్యనారాయణను విద్యావంతులు, మేధావులు భారీ మెజారిటీతో గెలిపించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య పట్టభద్రులను కోరారు. శనివారం భద్రాచలంలో కేంద్రంలో జిల్లా అధ్యక్షులు మారెల్లి విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ముఖ్య సమావేశంలో.. ఎమ్మెల్సీ అభ్యర్థి పూజారి సత్యనారాయణతో కలిసి సమావేశంలో మాట్లాడారు. దేశ ప్రగతి, రాష్ట్ర ప్రగతి కోసం శాసనాల ప్రతిపాదనల కోసం చర్చలు చేయాల్సిన పెద్దల సభకు శాసనమండలికి విద్యావంతులైన మేధావులను పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాజయ్య, రాష్ట్ర సలహాదారులు కృష్ణమోహన్, రాష్ట్ర కార్యదర్శి మాంచాలక్క, గ్రేటర్ వరంగల్ అధ్యక్షురాలు లక్ష్మి, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ యాదవ్, మహబూబాబాద్ జిల్లా మాలోతి వెంకటేష్, ఉపాధ్యక్షుడు మారెల్లి విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవాసవీమాత జయంతి వేడుకలు



అన్నపురెడ్డిపల్లి: నగరసంకీర్తన చేస్తున్న భక్తులు

అన్నపురెడ్డిపల్లి: శ్రీవాసవీ మాతా జయంతి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ వాసవీ– విఘ్నేశ్వర కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను జరిపించారు. సంఘం నాయకులు వనమా గాంధీ, జంగాల శ్రీనివాసరావు, వెంకటేష్, వనమా శ్రీను, జంగాల రాకేష్, దోసపాటి శంకరరావు పాల్గొన్నారు.

దమ్మపేట: శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా దమ్మపేటలోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిమతో బైక్ ర్యాలీని నిర్వహించారు. ఆలయానికి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.

సామూహిక కుంకుమార్చన...

మణుగూరు టౌన్: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా మణుగూరు వాసవీ క్లబ్, వనితా వైభవం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. గుట్టమల్లారంలోని గాయత్రి దేవి ఆలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి అనంతరం కుంకుమార్చన పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజారి ఆశీర్వచనాలు పొందారు. మణుగూరు వాసవీ క్లబ్ ప్రతినిధులు కేసా రాజేంద్ర ప్రసాద్, బొగ్గవరపు అంజలి, పాల్వాయి వసుంధర, కడివెండి విశ్వనాథ గుప్తా, బందారు నర్సింహారావు, శేషుబాబు, చిత్తలూరి రమేశ్‌బాబు, ఉమ తదితరులు పాల్గొన్నారు.




దమ్మపేటలో..



మణుగూరు టౌన్: సామూహిక కుంకుమార్చన..

ముత్యాలమ్మ జాతర ప్రారంభం



పూజలు అందుకున్న ముత్యాలమ్మ అమ్మవారు

దమ్మపేట: మండల కేంద్రంలో కొలువైయున్న శ్రీముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. శనివారం దమ్మపేటలో ముత్యాలమ్మ జాతరను పురస్కరించుకుని అమ్మవారికి కలశ, ఆకు, కుంకుమ అర్చన తదితర పూజా కార్యక్రమాలను వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. భక్తుల సౌకర్యార్థం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.

వేంకటేశ్వర స్వామివారి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండలకేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం ఘనంగా జరిపించారు. ఉదయం ఆలయంలో స్వామి వారికి పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.

21 నుంచి వీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్

కరకగూడెం: ఈనెల 21 నుంచి కరకగూడెం మండలంలోని చొప్పాల గ్రామంలో భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల స్థాయి విలేజ్ ప్రీమియర్ లీగ్ 3 (వీపీఎల్) సూపర్ సిక్స్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు టోర్నీ నిర్వాహకులు గుడ్ల రంజిత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నీలో పాల్గొనే క్రీడాకారులు తమ జట్టు పేర్లను 20 వ తేదీ ఉదయం 10 గంటల లోపు తెలియజేయాలని పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులతో పాటు విజేతకు నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు 9347292220 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దుమ్ముగూడెం : బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. మండలంలోని పలు గ్రామాలలోని బాధిత కుటుంబాలను శనివారం ఆయన పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు లంకా శ్రీనివాసరావు, కెల్లా శేఖర్, పిలక వెంకటరమణరెడ్డి, శ్రీధర్, గద్దం బాలాజీ, మట్టా శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులు రాజకీయంగా రాణించాలి



మాట్లాడుతున్న దేవయ్య

అశ్వారావుపేట/ములకలపల్లి/దమ్మపేట: మున్నూరుకాపులు రాజకీయంగా రాణించాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చల్లా దేవయ్య పటేల్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైతన్యయాత్ర శనివారం అశ్వారావుపేట, ములకలపల్లి, దమ్మపేట మండలాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. మున్నూరు కాపులు ఐక్యంటూ ఉండాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలన్నారు. పార్టీలకు అతీతంగా కాపులంతా ఏకం కావాలని, రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. మున్నూరుకాపు కార్పొరేషన్‌తో నిరుపేదల కాపులకు సాయం అవకాశం దక్కిందన్నారు. అంతకుముందు అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు సంఘం నాయకులను పరామర్శించారు. అశ్వారావుపేటలో నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఉపాధ్యాయుల సూర్యప్రకాశరావు, చిన్నంశెట్టి సత్యనారాయణ, తాడేపల్లి రవి, కొట్టే శ్రీను, దండా బత్తుల నరేష్, వాసా ఏసుబాబు, మద్దాల నాగేశ్వరరావు, ములకలపల్లిలో సంఘ మండలాధ్యక్షుడు మేకల పెద్దవెంకన్న, సంఘ రాష్ట్ర నాయకులు పల్లాల ప్రసాద్, యూఎస్ ప్రకాశ్‌రావు, జిల్లా కన్వీనర్ ఆది కోటేశ్వరరావు, కో–కన్వీనర్ లంక నర్సింహారావు, తోట రామకృష్ణ, పువ్వాల మంగపతి, శనగపాటి సీతారాములు, పుష్పాల చందర్ రావు, పువ్వాల లలితారావు, శనగపాటి అంజి, పువ్వాల శ్రీనివాస్, అయితా శేషగిరిరావు, బుగ్గారపు సత్యనారాయణ మిరియాల అవినాష్, శ్రీను, దమ్మపేటలో మండలాధ్యక్షుడు చిన్నశెట్టి సత్యనారాయణ, కోరుకొండ భాస్కరరావు, చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు, చిట్టిబాబు, మురహరి నాగరాజు, పానకాల సత్యనారాయణ, జంగాల చిన్నపుల్లారావు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సదుపాయాలు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మణుగూరు టౌన్: మున్సిపాలిటీ కార్మికులకు ఎరియర్స్ వెంటనే చెల్లించి ఇతర సదుపాయాలు కల్పించాలని ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాజేందర్ మాట్లాడుతూ... మున్సిపాలిటీ 2021 జూన్ 2023 మార్చి వరకు రావాల్సిన ఏరియర్స్ చెల్లించాలని, దుస్తులు, కొబ్బరినూనె, చెప్పులు, మాసుకులు, గ్లౌసులు వంటివి సదుపాయాలు కల్పించాలని కోరారు. పీఆర్సీ అమలు కావాల్సి ఉన్నప్పటికీ నేటికీ అమలుకాలేదన్నారు. చాలీచాలని వేతనాలతో ఆరోగ్యాలను ఫణంగా పెట్టి పని చేస్తూ అనారోగ్యాల పాలవుతున్న కార్మికులపై నిర్లక్ష్యం వీడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోడుతూరి లక్ష్మీనారాయణ, నర్సింహారావు, దుర్గయ్య, త్రిమూర్తులు, పోశం సరస్వతి నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎప్ సెట్ ఫలితాల్లో 'లిటిల్ ఫ్లవర్స్' ప్రభంజనం



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో విద్యాసంస్థల డైరెక్టర్లు, అధ్యాపకులు

భద్రాచలంటౌన్: పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు శనివారం విడుదలైన ఎప్ సెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ మేరకు మోడం మేఘన 3,831 ర్యాంకు, చలపాక వాసుదేవ మణిదీప్ కుమార్ 6,352 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు మాగంటి రమేష్ బాబు, ప్రసాద్ బాబులు మెమెంటోలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకుడు బషీర్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఐటీడీఏ ఏపీఆర్‌ఓగా వెంకటరమణ

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ అదనపు పౌర సంబంధాల అధికారిగా వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని డీపీఆర్వో శీలం శ్రీనివాస్ తెలిపారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఏపీఆర్‌ఓ పదోన్నతిపై బదిలీ కావడంతో ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకటరమణకు పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు వెల్లడించారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం రాజుపేట కాలనీలోని శ్రీరామ గాయత్రి ఆలయంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ధర్మకర్త ముగడ రామబ్రహ్మాచారి మాట్లాడుతూ... కాలభవిష్యత్‌ను స్వామివారి కాల జ్ఞాన పత్రికలో వివరించినట్లు స్పష్టం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పునాదులు, పిల్లర్లకే పరిమితం..!





అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు

అశ్వాపురం: మండల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామమైన మామిళ్లవాయి గ్రామంలో చేపట్టిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పునాదులు, పిల్లర్లకే పరిమితమై అడవిని తలపిస్తున్నాయి. గ్రామంలో 2017 డిసెంబర్ 22న ఒక్కో ఇల్లు రూ.5.04 లక్షలతో 30 ఇళ్లకు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన తర్వాత ఆలస్యంగా పనులు ప్రారంభమై రెండేళ్ల పాటు పనులు నత్తనడకన సాగాయి. నిర్మాణ వ్యయం పెరగడంతో ప్రభుత్వం చెల్లించే డబ్బు గిట్టుబాటు కాదని కాంట్రాక్టర్ అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. ఇందులో 10 స్లాబ్ వేయగా, 10 గోడలు, 10 పునాదులు, పిల్లర్ల స్థాయిలో ఉన్నాయి. ఆరేళ్లు గడిచినా ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తి కాలేదు. ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డబుల్‌బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి ఇళ్లు లేని గిరిజన నిరుపేదలకు ఇళ్లు ఇవ్వాలని గిరిజనులు కోరుతున్నారు.